కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 05 జూలై 2026

### గణన పత్రాల పంపిణీ,

## డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించిన ఆర్డీవో



**బద్వేల్, జూలై 4, ప్రభాతవార్త:**
బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆంజనేయ నగర్, శివ నగర్, పూసలవాడ సచివాలయాల పరిధిలో గల పోలింగ్ స్టేషన్లు 226 నుంచి 228, 231 నుంచి 235 వరకు జరుగుతున్న గణన పత్రాల పంపిణీ, డిజిటలైజేషన్ ప్రక్రియను శనివారం బద్వేల్ ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా గోపవరం తహసీల్దార్, బద్వేల్ మున్సిపల్ కమిషనర్‌తో కలిసి సంబంధిత పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఆర్డీవో, గణన పత్రాల పంపిణీ, డిజిటలైజేషన్ పనుల పురోగతిని సమీక్షించారు. ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

## ఈ తరం యువతకు ఆదర్శనీయం.. అల్లూరి

**కడప, జూలై 4 ప్రభాతవార్త :**
స్వాతంత్ర్య సమరయోధులు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఈ తరం యువతకు ఆదర్శనీయం అని.. జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ పిజిఆర్ఎస్ హాలులో అల్లూరి సీతారామరాజు 129వ జయంతి ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి డిఆర్వో మల్లికార్జునుడు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజానికి.. అల్లూరి సీతారామరాజు ధైర్య సాహసాలు ఆదర్శణీయం అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల త్యాగాలను మరువరాదని, ఆయన ధైర్య సాహసాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి, అందుకోసం తన ప్రాణాలర్పించిన యోధుడన్నారు. కేవలం 27 ఏళ్ళ వయసులోనే చాలా పరిమిత వనరులతో బ్రిటీషు సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొట్టి వీర మరణం పొందిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. ప్రతి ఏడాది జులై 4వ తేదీని అల్లూరి సీతారామరాజు జయంతిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించడం అభినందనీయం అన్నారు. అంతకుముందు సమావేశానికి ఆహాజరైన ముఖ్య అతిధులు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

### ఆదాయ లక్ష్యాల సాధనకు

# సమన్వయంతో పనిచేయాలి

### అక్రమ మద్యం రవాణాపై కట్టుదిట్టమై నిఘా పెట్టాలి : జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

**మదనపల్లె, జులై 4 ప్రభాతవార్త :**
జిల్లాలో ఖజానాకు ఆదాయ పెంపుకోసం శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని, అక్రమ మద్యం రవాణాపై కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. శనివారం మదనపల్లె కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశపు హాలులో ఎక్సైజ్, కమర్షియల్ ట్యాక్స్, రవాణా, మైనింగ్, రిజిస్ట్రేషన్, అటవీ, పంచాయితీరాజ్, మున్సిపల్ శాఖలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ శాఖల వారీగా ఆదాయ సాధన పురోగతిని సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆదాయం పెంపుకోసం శాఖలన్నీ పటిష్టమైన కార్యచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. పన్నుల వసూళ్లలో పారదర్శకత, సమర్థత పెంపుతో ఆదాయ వృద్ధి సాధించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. చీప్ లిక్కర్, సారాను పూర్తిగా అరికట్టాలన్నారు. మద్యం దుకాణాల్లో, బార్లల్లో సిసిటివిల పనితీరును పర్యవేక్షించి అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. కర్నాటక, తమిళనాడు నుంచి అక్రమ మద్యం రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్, పంచాయితీరాజ్ పన్నుల్లో జిఎస్‌టి వసూళ్ళు తప్పనిసరిగా జరిగేలా చూడాలన్నారు. మండల అధికారులు, గ్రామ పంచాయితీలకు జిఎస్‌టి రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించి అందరూ రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లేవుట్లను గుర్తించి వాటిని రెగ్యులర్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ శాఖ స్లాట్ ప్రకారం రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేయాలన్నారు. రిజిస్ట్రేషన్‌ల్లో ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా చూడాలన్నారు. జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది ఖాళీల వివరాలను తెలపాలని ఆశాఖ అధికారులకు ఆదేశించారు.

### ట్రిపుల్ ఐటీ

## రెండో విడత కౌన్సిలింగ్

### ఆర్జీయూకేటి రిజిస్ట్రార్ ఆచార్య అమరేంద్ర కుమార్

**వేంపల్లె జూలై 04 ప్రభాతవార్త**
ఆర్జీయూకేటి యూజీ26 అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించి ఆర్కేవ్యాలి, ఒంగోలు ట్రిపుల్ ఐటీల రెండో విడత కౌన్సిలింగ్ నిర్వహించినట్లు ఆర్జీయూకేటి రిజిస్ట్రార్ ఆచార్య అమరేంద్ర కుమార్ వెల్లడించారు. శనివారం ట్రిపుల్ ఐటీ సెంట్రల్ లైబ్రరీలో ఈ కౌన్సిలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఆర్కేవ్యాలి క్యాంపస్ మిగిలిన ఉన్న 8 సీట్లకు ఇద్దరు విద్యార్థులు హాజరై అడ్మిషన్లు పొందారు. అలాగే ఒంగోలు క్యాంపస్ మిగిలిన ఉన్న 436 సీట్లకు, 320 మంది విద్యార్థులు హాజరై అడ్మిషన్లు పొందారు. మిగిలిన సీట్లకు మూడో విడత కౌన్సిలింగ్ ప్రక్రియ త్వరలోనే ప్రకటిస్తామని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆచార్య అమరేంద్ర కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్కేవ్యాలి డైరెక్టర్ జి.విజయ్ ప్రకాష్, ఆయా క్యాంపస్ లో పరిపాలన అధికారులు డా. పి. రవికుమార్, ఎన్. చంద్రశేఖర్, అకాడమీక్ డీన్ రమేష్ కైలాస్, రూపస్ కుమార్, స్టూడెంట్ వెల్ఫేర్ డా. జీ. వెంకటేష్, అసోసియేట్ డీన్లు రాఘవరెడ్డి, నవీన్, ఉదయశ్రీ, హుస్సేన్, తిలక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. దీప్తి, అధికారులు బిన్నీ, ఓబయ్య, కోనప్ప, రాము, భాస్కరయ్య, పెద్దన్న, పిఆర్ఓ డా.తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### స్కౌట్స్ కార్యకలాపాలతో

## విద్యార్థుల సమగ్ర వికాసం : డీఈవో



**రాయచోటి జులై 4 ప్రభాతవార్త**
అన్నమయ్య జిల్లాలో 2026-2027 విద్యా సంవత్సరానికి సంబంధించిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా నెలవారీ కార్యకలాపాల క్యాలెండర్ను అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా అమలు చేయాలని, స్కౌట్స్ కార్యకలాపాల ద్వారా విద్యార్థుల్లో సమగ్ర వికాసం కలుగుతుందని జిల్లా చీఫ్ కమిషనర్, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కె. సుబ్రమణ్యం పేర్కొన్నారు. శనివారం రాయచోటిలోని స్కౌట్ కార్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ వార్షిక కార్యకలాపాల క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో ఉన్న అన్ని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లలో ఈ క్యాలెండర్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి యూనిట్ లీడర్ కార్యాచరణ ప్రణాళికను అనుసరించి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర కార్యాలయం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు జిల్లా అవసరాలకు అనుగుణంగా నెలవారీ కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. ప్రతి నెలా సేవా కార్యక్రమాలు, సోపాన్ పరీక్షలు, శిక్షణా శిబిరాలు, ప్రత్యేక దినోత్సవాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, సాహస కార్యక్రమాలు, అవగాహన ర్యాలీలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సేవాస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, జాతీయ సమైక్యతను పెంపొందించేలా కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు, గైడ్ కెప్టెన్ రేఖ, స్కౌట్ మాస్టర్లు మురళీమోహన్, పీరయ్య, స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యులు, యూనిట్ లీడర్లు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

### రూ. 17.94 లక్షల ఆస్తి స్వాధీనం

### వివరాలు వెల్లడించిన జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి



**పీలేరు జూలై 4 ప్రభాతవార్త;**
పీలేరు పట్టణంలో వరుస ఇళ్ళ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు శనివారం చాకచక్యంగా అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం. వెంకటాద్రి మదనపల్లిలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ పర్యవేక్షణలో పీలేరు సీఐ యు. వెంకటేశ్వర్లు, సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు రహీం, లోకేష్‌లు తమ సిబ్బందితో కలిసి కావడి సోమశేఖర్ (మదనపల్లి), కర్ణాటకకు చెందిన జోగి బంగారప్ప, శ్రీనివాసులు రాజులను వేర్వేరు చోట్ల అరెస్ట్ చేశారు. నిందితుల నుండి స్వాధీనం చేసుకున్న రూ. 17.44 లక్షల విలువైన 109 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 50 వేల విలువైన ఒక మోటార్ సైకిల్‌ను (మొత్తం విలువ రూ. 17,94,000/) స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా అరెస్టుతో 2వ పేజీలో

### బాలికలు విద్యతో పాటు

## క్రీడల్లోనూ రాణించాలి : ఎమ్మెల్సీ





**పులివెందుల జూలై 4, ప్రభాతవార్త :**
బాలికలు విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి సూచించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తొండూరు మండలంలోని మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థినులకు షూస్, స్పోర్ట్స్ దుస్తుల కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ముందుగా మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, అనంతరం విద్యార్థినులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలికల అభివృద్ధికి విద్యే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. విద్య ద్వారా సమాజంలో గౌరవం, గుర్తింపు పొందడంతో పాటు ఉన్నత స్థానాలను అధిరోహించే అవకాశాలు లభిస్తాయన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతి విద్యార్థిని అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచేలా కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థినులు తమ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. హరిత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఐదేళ్లలో వైసిపి ఏమి చేసిందో

# చర్చించే దమ్ముందా?

### రాయలసీమను సర్వనాశనం చేసిన గొడ్డలి పార్టీ

### టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు సవాల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు

**రాజంపేట, జూలై 4 ప్రభాతవార్త**
ఐదేళ్ల జగన్ వైకాపాలనలో రాయలసీమ అన్ని విధాల సర్వనాశనం అయిందని, గొడ్డలి పార్టీ దెబ్బకు పరిశ్రమలు వెనక్కు వెళ్లిపోయాయని, పారిశ్రామికవేత్తలు పారిపోయారని, అభివృద్ధి కుంటుపడిందని, నిరుద్యోగ సమస్య ఎక్కువైందని టిడిపి రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు ధ్వజమెత్తారు. రాయలసీమపై వెధవ రాజకీయాలు చేస్తున్న గొడ్డలి పార్టీ నేతలు దమ్ముంటే ఐదేళ్ల వైకాపాలనలో జరిగిన అభివృద్ధి పై చర్చకు దమ్ముంటే సిద్ధం కావాలని సవాల్ విసిరారు. రెండేళ్లలో కుటుంబ ప్రభుత్వం ఏం చేసిందో చర్చించేందుకు తాము సిద్ధమని స్పష్టం చేశారు. తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాయలేలిన రాయలసీమలో రాయల్ గానే చంద్రబాబు నాయకత్వంలో స్వర్ణ రాయలసీమగా తీర్చిదిద్దేందుకు ముందుకు సాగుతున్నామన్నారు. రాయలసీమ జిల్లాల రూపురేఖలు మారే విధంగా విజన్ రూపొందించి చంద్రబాబు నభూతి నభవిష్యత్ అన్న చందంగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. రాయలసీమ ద్రోహులు గొడ్డలి పార్టీ నేతలనీ మండిపడ్డారు. రాయలసీమ బ్రాండ్ ఇమేజ్ను సర్వనాశనం చేశారనీ విరుచుకుపడ్డారు. విధ్వంసకర పరిపాలనతో రాయలసీమ అభివృద్ధి నిరోధకులుగా మారారని విమర్శించారు. వైకాపా నిరంకుశ పాలనతో పరిశ్రమలు పోయాయి. పెట్టుబడులు పోయాయి. పారిశ్రామికవేత్తలు పారిపోయేలా చేశారు. అమర్ రాజా లాంటి బహుళ జాతి పరిశ్రమలు వెళ్లిపోయేలా చేశారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయలేదు, మౌలిక వసతులు మర్చిపోయారు. ఐదేళ్ల వైసిపి పాలనలో రాయలసీమను సర్వనాశనం చేశారు. ఐదేళ్లలో ఏమి చేశారో చెప్పే దమ్ముందా అని జగన్మోహన్ రాజు సవాల్ విసిరారు. చర్చకు సిద్ధమని ప్రశ్నించారు. రాయలేలిన రాయలసీమను రాయల్ గా అభివృద్ధి చేస్తున్నాము. స్వర్ణ రాయలసీమను చేస్తున్నాము. అనంతపురంజిల్లాలో రక్షణ పరిశ్రమలు, ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్, కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమకు ప్రాణం పోశాం, కొప్పర్తి పారిశ్రామికవాడ అభివృద్ధికి వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. రాయల్ ఎన్ఫీల్డ్, డైకిన్, కెరీర్, మొబైల్ పరిశ్రమలు ఏర్పాటు అయ్యాయి. చిత్తూరు జిల్లాలలో కనివిని ఎరుగని రీతిలో వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. ఇప్పటికే నాలుగున్నర లక్షల కోట్ల పెట్టుబడి వచ్చాయి. 2.76 లక్షల ఉద్యోగాలు సృష్టించాము. హంద్రీనీవా సుజల స్రవంతి పూర్తిగా వచ్చింది . గాలేరు నగరి త్వరలో పూర్తి అవుతుంది. సీమ బ్రాండ్ ఇమేజ్ చెరగొట్టారు. రాయలసీమ ప్రాంతానికి ప్రాణప్రదమైన డ్రిప్ ఇరిగేషన్ను రద్దుచేసి రైతుల కడుపు కొట్టారు. రాయలసీమ ఉద్యానవన హబ్ లక్ష కోట్లతో మేము ఏర్పాటు చేయబోతున్నాం. వైసీపీకి దమ్ముంటే ఐదేళ్లలో రాయలసీమలో ఎన్ని పరిశ్రమలు ఏర్పాటు చేశారు. ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు. ఎన్ని ప్రాజెక్టులు పూర్తి చేశారు. ఎన్ని ఎకరాలకు నీరు ఇచ్చారు.ఎన్ని నిధులు ఖర్చు చేశారు. రాయలసీమానికి రాయలసీమ ప్రాంతానికి ఐదేళ్లలో ఏమి చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో రాజంపేట వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు,పార్టీ మండల గ్రామీణ అధ్యక్షుడు మేడికొండ రవికుమార్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, రాష్ట్ర మాజీ తెలుగు యువత కార్యదర్శి ఇడిమడకల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై ఎమ్మెల్యేను కలిసిన ఎన్జీవోలు

**ప్రొద్దుటూరు అర్బన్, జులై 4, ప్రభాతవార్త**
ప్రొద్దుటూరు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎన్‌జీఓ) జిల్లా నాయకత్వం, జేఏసీ ప్రతినిధులు శనివారం ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జేఏసీ ఛైర్మన్ అలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, డి.వి. రమణ సూచనల మేరకు కడప జిల్లా అధ్యక్షుడు, జేఏసీ ఛైర్మన్ బి. శ్రీనివాసులు, ప్రొద్దుటూరు తాలూకా అధ్యక్షుడు జె. రామసుబ్బయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి ఉద్యోగుల ప్రధాన సమస్యలను వివరించారు. వేతన సవరణ కమిటీని (పీఆర్సీ) వెంటనే ఏర్పాటు చేయడంతో పాటు మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం (డీఏ) బకాయిలు, సరెండర్ లీవ్ నగదు బకాయిలను ఆలస్యం లేకుండా విడుదల చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేయాలని ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునేలా కృషి చేయాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి సమస్యలను పరిశీలించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి. నిత్యపూజయ్య, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి డి. పద్మనాభరావు, ప్రొద్దుటూరు కార్యదర్శి ప్రమీల, కోశాధికారి సదాశివయ్య, ఉపాధ్యక్షులు వరప్రసాద్, నాగార్జున, పీఆర్టీయూ నాయకుడు రమణ, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, ట్రెజరర్ లక్షుమన్నతో పాటు పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పాల్గొన్నారు.




## ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పుట్టా



**మైదుకూరు, జులై 04, ప్రభాతవార్త:**
మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ శనివారం నియోజకవర్గంలో రెండు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సర్వాయపల్లెలో అత్యంత వైభవంగా నిర్వహించిన శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, వేద పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఎమ్మెల్యే భక్తిశ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకుని వేద పండితుల ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా భక్తులతో ఆప్యాయంగా మమేకమైన ఆయన, ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అంతే కాకుండా ఈ పవిత్ర క్షేత్రం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా భగవంతుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుభిక్షం చేకూరాలని, మైదుకూరు నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని పుట్టా సుధాకర్ యాదవ్ ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జిందాల్ స్టీల్ పరిశ్రమకు క్రెడిట్ జగన్‌దే : ఎంపీ అవినాష్ రెడ్డి

### అనుమతులు, భూ కేటాయింపు, వైకాపా హయాంలోనే... కడప సభను జగన్‌పై విమర్శల వేదికగా మార్చిన చంద్రబాబు




**పులివెందుల, జూలై 4, ప్రభాతవార్త :**
జిందాల్ స్టీల్ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన అన్ని కీలక చర్యలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలోనే జరిగాయని, ఇప్పుడు దానికి క్రెడిట్ తీసుకునేందుకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆరోపించారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిందాల్ స్టీల్ పరిశ్రమ ప్రారంభం రాయలసీమకు శుభపరిణామమేనని, అయితే దాని వెనుక ఉన్న వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. 2023 ఫిబ్రవరిలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, సజ్జన్ జిందాల్ కలిసి పరిశ్రమకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. 2022లోనే జిందాల్ స్టీల్‌కు భూ కేటాయింపు, పన్ను రాయితీలు, విద్యుత్ ఛార్జీల మినహాయింపులతో కూడిన ప్రోత్సాహకాలను ప్రభుత్వం జీవో ద్వారా మంజూరు చేసిందన్నారు. పరిశ్రమకు అవసరమైన పర్యావరణ అనుమతులు, 2 టీఎంసీల నీటి కేటాయింపు, రూ.50 కోట్లతో అప్రోచ్ రోడ్డు నిర్మాణం కూడా తమ ప్రభుత్వమే చేపట్టిందని చెప్పారు. ఇటీవల జరిగిన కార్యక్రమంలో చంద్రబాబు పరిశ్రమను తానే తీసుకొచ్చినట్లుగా చెప్పారని, అయితే అదే రోజు సజ్జన్ జిందాల్ సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్టులో వైఎస్ జగన్ ప్రభుత్వ సహకారాన్ని ప్రస్తావిస్తూ కృతజ్ఞతలు తెలిపారని అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. దీంతో వాస్తవాలు ప్రజల ముందుకు వచ్చాయని అన్నారు. 2007 లో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి బ్రహ్మణి స్టీల్ ప్రాజెక్టును తీసుకొచ్చారని, ఆయన మరణానంతరం ఆ పనులు నిలిచిపోయాయని చెప్పారు. 2018లో చంద్రబాబు ప్రభుత్వం కంబాలదిన్నె వద్ద శంకుస్థాపన చేసినా, పరిశ్రమను ఏ సంస్థ నిర్మిస్తుందో కూడా స్పష్టత లేదని, అది ఎన్నికల స్టంట్ మాత్రమేనని విమర్శించారు. అమరావతి అంశంపై స్పందిస్తూ, అక్కడ రాజధాని నిర్మాణానికి రూ.2 లక్షల కోట్లు అవసరమని చెబుతున్నారని, ఇప్పటికే ఉన్న మౌలిక వసతులను 2వ పేజీలో

## ఆదర్శ పాఠశాలను సందర్శించిన అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్



**పీలేరు, కేవీ పల్లె, జూలై 4 ప్రభాతవార్త:**
అన్నమయ్య జిల్లా ఆదర్శ పాఠశాల, కె.వి.పల్లిని శనివారం సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ అనురాధ సందర్శించారు. ఈ సందర్భంగా పీఎం పథకం కింద విడుదలైన నిధులు, వాటి వినియోగం మరియు చేపట్టిన అభివృద్ధి పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, బోధనఅభ్యాస విధానాలపై ఆరా తీశారు. సందర్శనలో భాగంగా పాఠశాలలోని సైన్స్ 2వ పేజీలో

# సాంఘిక సంక్షేమ శాఖ పార్ట్‌టైం టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

**పులివెందుల, జూలై 4 ప్రభాతవార్త :**

రాష్ట్రవ్యాప్తంగా సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న సుమారు 1,800 మంది పార్ట్‌టైం టీచర్లు తమ ఉద్యోగ సమస్యలను ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. శనివారం పట్టణం లోని ఎమ్మెల్సీ స్వగృహం నందు ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డికి పార్ట్ టైమ్ ఉద్యోగులు తమకు న్యాయం చేయాలంటూ ఎమ్మెల్సీకి విన్నవించు కున్నారు. పార్ట్‌టైం విధానంలో నియమితులైనా, పూర్తి సమయం విధులు నిర్వహిస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నప్పటికీ తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే తమ సమస్యలను సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన ఫలితం రాలేదని పేర్కొన్న టీచర్లు, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డిని కలిసి పలు కీలక డిమాండ్లతో వినతిపత్రం సమర్పించారు. టీచర్లు ప్రధానంగా పార్ట్‌టైం టీచర్లను కేజీబీవీల్లో అమలు చేసిన విధానాన్ని ఆదర్శంగా తీసుకుని కాంట్రాక్ట్ టీచర్లుగా మార్చాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత కల్పించాలని, విధుల నిర్వహణకు సంబంధించిన జాబ్ చార్ట్, వర్కింగ్ ప్యాటర్న్‌పై స్పష్టమైన సర్క్యులర్ జారీ చేయాలని, అలాగే ప్రతి నెల జీతాలను సకాలంలో విడుదల చేయాలని కోరారు. టీచర్ల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, వారి న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తప్పనిసరిగా తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. పార్ట్‌టైం టీచర్లను కాంట్రాక్ట్ టీచర్లుగా మార్చే అంశంపై ప్రభుత్వంతో చర్చించి సానుకూల నిర్ణయం వచ్చేలా కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా తమ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీ స్పందించి హామీ ఇవ్వడంపై పార్ట్‌టైం టీచర్లు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం త్వరితగతిన సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ఎమ్మెల్సీకి తమ సమస్యలను వివరించుకున్న పార్ట్ టైమ్ ఉద్యోగులు

# వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు

**బద్వేల్ అర్బన్, జూలై 4, ప్రభాతవార్త:**

నిజ జ్యేష్ఠ మాసంలోని మూడో శనివారం సందర్భంగా శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, అభయ అంజనేయ స్వామి దేవాలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు వీరేశాచార్యులు ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక అర్చనలు, పలు రకాల విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రత్యేక అభిషేక దాతలుగా గోవులవారి వెంకటేశ్వర్లు-మహాలక్ష్మి దంపతులు, కానుగల గోపాల కృష్ణ-రాజేశ్వరి దంపతులు, కానుగల రఘురామయ్య-కనకదుర్గ దంపతులు, మాలేపాటి సునీల్ కుమార్-నవలత దంపతులు, సముద్రాల రాజేంద్ర ప్రసాద్-సౌజన్య దంపతులు, వల్లంకొండు శివకుమార్-పుష్పలత దంపతులు, ఉలెట్ల కొండారెడ్డి-సుభాషిణి దంపతులు, తొడేటి సుబ్బయ్య-తిరుపతమ్మ దంపతులు, ముచ్చర్ల సుధాకరరావు-సుజాతమ్మ దంపతులు, మెంటా నాగేంద్ర-సౌజన్య లక్ష్మి దంపతులు, అక్షంతల లక్ష్మీదేవి, ఆమె కుమారుడు మురళి కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక అభిషేక సేవల్లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు.

# సబ్సిడీపై కందులు, మినుములు

**దువ్వూరు, జూలై 04, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని రైతులకు పప్పు ధాన్యాల మిషను మరియు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలో భాగంగా 50 శాతం సబ్సిడీపై మినుములు, కందులు మంజూరు అయినట్లు మండల వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి తెలిపారు. మినుములకు సంబంధించి విబిఎన్ 9, 10 రకాలు పూర్తి 4కేజీల ధర 518 రూపాయలు అని సబ్సిడీ 240 పోగా 270 రూపాయలు చెల్లించి పొందాలన్నారు. అలాగే ఎల్లార్జి10 కందులు పూర్తి ధర 490 రూపాయలు అని 240 సబ్సిడీ పోను 250 రూపాయలు చెల్లించి పొందాలన్నారు. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకుని కలిసి పేరు నమోదు చేసుకొని విత్తనాలు పొందాలన్నారు. విత్తనాలు తీసుకున్న రైతులు తప్పనిసరిగా సాగు చేయాలని, పంట నమోదు కూడా చేస్తారన్నారు. అందువల్ల దుర్వినియోగం చేయావద్దని రైతులకు తెలిపారు. అవసరమైన రైతులు మాత్రమే మినుము, కందుల విత్తనాలను పొందాలన్నారు.

# లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

**పులివెందుల, జూలై 4, ప్రభాత వార్త :**



పట్టణంలో ట్రాఫిక్ నిబంధనల అమలుపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు వాహనదారుల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచే లక్ష్యంతో శనివారం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్‌లో సీఐ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ద్విచక్ర, ఇతర వాహనాలను ఆపి డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, బీమా, ఇతర వాహన పత్రాలను పరిశీలించారు. హెల్మెట్ ధరించకుండా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై ట్రాఫిక్ నిబంధనల ప్రకారం జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా సీఐ ప్రసాద్‌రావు మాట్లాడుతూ, ప్రతి వాహనదారుడు ఇంటి నుంచి బయలుదేరే ముందు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అవసరమైన వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించి పోలీసులకు సహకరించాలని సీఐ ప్రసాద్‌రావు కోరారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు

# ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువ అయ్యే అవకాశం



**లక్కిరెడ్డిపల్లి జూలై 4 ప్రభాతవార్త**

ఎల్ ని నో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షాలు తక్కువ పడే అవకాశం ఉందని దీనిపైన రైతులు అవగాహన కలిగి ఉండాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ ఎండి షఫీ నాయక్ వ్యవసాయ అధికారి రాజకుమారి పేర్కొన్నారు శనివారం స్థానిక రైతు సేవ కేంద్రం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ నీ నో ప్రభావం వల్ల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు ప్రణాళిక రూపొందించుకొని శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తే పంట నష్టాలను తగ్గించవచ్చు అని వారి తెలియజేశారు వాతావరణ సూచనలను ప్రతిరోజు గమనించి వాటి ఆధారంగా వ్యవసాయ కార్యకలాపాలను నిర్వహించాలన్నారు వర్షాలు స్థిరంగా ప్రారంభమైన తర్వాతే ప్రధాన పంటలను సాగు చేసుకోవాలన్నారు శివయ్య వ్యవసాయ శాఖ అధికారులను రైతులు సంప్రదించి సాంకేతిక సూచనలు పాటించాలన్నారు పంటలకు అవసరమైన నీటిని పొదుపుగా వినియోగించుకొని పద్ధతులను అనుసరించి పంట సాగు చేయాలన్నారు సముతుల్య ఎరువులను వినియోగంలో పాటు సమగ్ర స్వీడపీడల యాజమాన్యాన్ని అమలు చేసుకోవాలని వారు సూచించారు ఈ కార్యక్రమంలో ఏపీఎం నిరంజన్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ వెంకటరామరాజు జెడ్ బి ఎన్ ఎఫ్ సిబ్బంది డిఆర్డిఏ సిబ్బంది టిడిపి నాయకులు ప్రతాపరెడ్డి పకీరయ్య రామచంద్రయ్య డ్వాక్రా మహిళలు రైతులు పాల్గొన్నారు.

# అల్లూరి చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులు

**పీలేరు జూలై 4 ప్రభాతవార్త:**



మాతృభూమి విముక్తి కోసం కేవలం 27 ఏళ్లకే ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన మన్నెం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆ మహనీయునికి నివాళులు అర్పిస్తున్నానని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ వారి దోపిడీకి వ్యతిరేకంగా గిరిజనుల హక్కుల కోసం, అడవి బిడ్డల ఆత్మగౌరవం కోసం తుపాకీ పట్టి పోరాడిన ధీరుడు అల్లూరి అన్నారు.

# మాదిగల పుణ్యక్షేత్ర శంకుస్థాపన విజయవంతం చేయండి



**రాయచోటి జులై 4 ప్రభాతవార్త**

మాదిగల పుణ్యక్షేత్ర శంకుస్థాపన కార్యక్రమం విజయవంతం చేయండని MRPS జాతీయనేత రామాంజనేయులు ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆయన శనివారం అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం తాసిల్దార్ కార్యాలయం ప్రక్కన అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు మాదిగల పుణ్యక్షేత్ర శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కరపత్రాలు విడుదలచేశారు. ఎమ్మార్పీఎస్ జాతీయ నేత రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ1994జులై 7న ప్రకాశం జిల్లా నాగులప్పలపాడు మండలం ఈదుముడి గ్రామంలో 20 మంది యువకులతో ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ ఉద్యమం 30 సంవత్సరాల పాటు సుదీర్ఘ పోరాటం చేసి ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడం జరిగిందన్నారు ఈ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని జైళ్ల పాలై చివరికిమాదిగ బిడ్డల ప్రాణ త్యాగాల ఫలితంగా సాధించుకున్న ఎస్సీ వర్గీకరణకు ప్రతీకగా ఎప్పటికీ గుర్తుండిపోయేలా మాదిగల పుణ్యక్షేత్ర నిర్మాణం జరుగుతుందాన్నారు. కావున ఈనెల 7వ తేది ఉదయం 10"గం"లకు ప్రకాశం జిల్లా ఈదుముడి అందరూ తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పెదివీటి వెంకటరమణ రాజా, రవిశంకర్, నాగయ్య, లక్ష్మీనారాయణ, సిద్దయ్య, బి వెంకటరమణల తో పాటు మద్దతుగా గోపాల్, సుధాకర్ మరియు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

**సిద్ధవటం జూలై 4 ప్రభాతవార్త**



11వ పోలీస్ బెటాలియన్‌లో ఇన్చార్జి కమాండెంట్ కె.ప్రభు కుమార్ ఆదేశాల మేరకు అల్లూరి సీతారామ రాజు జయంతి వేడుకలు నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ కమాండెంట్ పి.రాజశేఖర్ ముఖ్య అతిథిగా విచ్చేసి, అమరవీరుడు అల్లూరి సీతారామ రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో అల్లూరి సీతారామ రాజు ఒక మహోన్నత విప్లవ వీరుడని పేర్కొన్నారు. ఆయన నిర్వహించిన సాయుధ పోరాటం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమని, స్వాతంత్రం కోసం సాయుధ పోరాటమే మార్గమని విశ్వసించి, ఆ లక్ష్య సాధన కోసం తన ప్రాణాలను అర్పించిన మహా యోధుడనికొనియాడారు. కేవలం 27సంవత్సరాల వయస్సులోనే బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ధైర్యంగా ఎదిరించి, గిరిజనుల హక్కుల కోసం పోరాడిన మహనీయుడి గా ఆయనను స్మరించుకున్నారు నేటి యువత అల్లూరి సీతారామరాజు దేశభక్తి, త్యాగనిరతి, ధైర్యసాహసాలను ఆదర్శంగా తీసుకొని దేశ సేవకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ సబ్ఇన్స్పెక్టర్లు మరియు బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంరక్షణకు ప్రాధాన్యం

**పులివెందుల, జూలై 4, ప్రభాతవార్త :**

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యం, సంరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. పులివెందుల పట్టణంలోని యర్రగుడిపల్లె-2 అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడి నిర్వహణ తీరును పరిశీలించారు. కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ, మౌలిక సౌకర్యాలపై ఎమ్మెల్సీ ఆరా తీశారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహార పదార్థాల నాణ్యతను పరిశీలించిన ఆయన, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని క్రమం తప్పకుండా అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కేంద్రంలోని హాజరు పట్టిక, ఇతర రికార్డులను పరిశీలించి నిర్వహణపై పలు సూచనలు చేశారు. చిన్నారులకు పరిశుభ్రమైన, సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం ప్రతి అంగన్‌వాడీ సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. కేంద్రానికి వచ్చే ప్రతి చిన్నారి ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనా లు అర్హులైన ప్రతి చిన్నారికి సక్రమంగా అందేలా అంగన్ వాడీ సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి



# పార్ట్ టైం అధ్యాపకులు సీఎంకు వినతి..

**బ్రహ్మంగారి మఠం జూలై 04 ప్రభాతవార్త**



రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో కళాశాలలో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులు లెక్చరర్స్‌కు భద్రత కల్పించాలని ప్రభుత్వ పథకాలకు అర్హులను చేయాలని పెండింగ్ లో ఉన్న జీతాలను విడుదల చేయాలని తమ శ్రమకు గుర్తింపు ఇవ్వాలని అంబేద్కర్ గురుకుల పాఠశాలల కళాశాలల యూనియన్ నాయకులు శనివారం కుప్పం పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి వినతి పత్రాన్ని సమర్పించారు ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఆదినారాయణ రెడ్డి ప్రవీణ్ మురగారెడ్డి గురు రత్నం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 1839 మంది పార్ట్ టైం ఉపాధ్యాయులుగా లెక్చరర్స్‌గా పనిచేస్తున్నారని వారి కష్టాన్ని పనితనాన్ని గుర్తించి వేతన సవరణ చేయాలని అలాగే ప్రభుత్వ పథకాలు వర్తించేలాగా అమలుపరచాలని పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని వారు ముఖ్యమంత్రివర్యులు దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు ఈ విషయం పట్ల ముఖ్యమంత్రివర్యులు సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించేలాగా చర్యలు చేపడతారని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# పులివెందుల డీఈగా మనోహర్ రెడ్డికి పదోన్నతి

**పులివెందుల, జూలై 4, ప్రభాతవార్త :**



నియోజక వర్గం లోని లింగాలలో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)గా విధులు నిర్వహించిన మనోహర్ రెడ్డి పులివెందుల డిప్యూటీ ఇంజనీర్ (డీఈ)గా పదోన్నతి పొందిన సందర్భంగా శనివారం పులివెందుల టీడీపీ కార్యాలయంలో తుంగభద్ర ప్రాజెక్టు హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మనోహర్ రెడ్డికి పదోన్నతి లభించినందుకు మారెడ్డి జోగిరెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. నూతన బాధ్యతల్లో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించి, మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, జొన్నలగడ్డ ధనుంజయ నాయుడు (పార్నపల్లె ధన), గురవిరెడ్డి తదితరులు పాల్గొని మనోహర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యం



**పులివెందుల, జూలై 4 ప్రభాతవార్త :**

ప్రజల సమస్యల పరిష్కారమే తన తొలి ప్రాధాన్యమని మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. పులివెందులలోని టీడీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, మౌలిక సదుపాయాలకు సంబంధిం చిన సమస్యలను బీటెక్ రవి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని ఆయన ఓర్పుగా విని, సమస్యల స్వభావాన్ని తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని బీటెక్ రవి తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం తన బాధ్యతగా భావిస్తు న్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.

# రేషన్‌లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

**బద్వేలు, జూలై 4, ప్రభాతవార్త**

రేషన్ షాప్ సరఫరా లబ్ధిదారులకు సక్రమంగా జరిగేలా చూడాలని, షాపుదారులు ఇలాంటి అక్రమాలకు పాల్పడిన చర్యలు తప్పవని విజిలెన్స్ సిఐ శ్రీనివాసులు రెడ్డి, పాల్గొన్న సివిల్ సప్లై డీటీ శివశంకర్ లు పేర్కొన్నారు. శనివారం షాప్ నెంబర్1112007 లో తనిఖీలు చేపట్టారు. రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే సీజ్ చేస్తాం అని హెచ్చరించారు.



# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

పీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని మొత్తం 7 దొంగతనం కేసులు (Cr.No: 48, 76, 103, 11, 142, 143, 145/2026) ఛేదించబడ్డాయి. నిందితులపై BNS చట్టం కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపడం జరుగుతుంది. అదనపు ఎస్పీ గారు మాట్లాడుతూ.. ప్రజలు ఊర్లకు వెళ్లేటప్పుడు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానితులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100/112 కు సమాచారం అందించాలని తెలిపారు. సమర్థవంతంగా పనిచేసి ముఠాను పట్టుకున్న రాయచోటి డిఎస్పీ యం.ఆర్. కృష్ణ మోహన్ పీలేరు సీఐ యు. వెంకటేశ్వర్లు, సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు, లోకేష్, రహీం మరియు పోలీస్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్లు అదనపు ఎస్పీ పేర్కొన్నారు.

# జిందాల్ స్టీల్ పరిశ్రమకు క్రెడిట్ జగన్‌దే : ఎంపీ

అభివృద్ధి చేయడానికి రూ.25 వేల కోట్లు సరిపోతాయని అభిప్రాయపడ్డారు. మూడు రాజధానుల ప్రతిపాదన అన్ని ప్రాం తాల సమాన అభివృద్ధి కోసమేనని పేర్కొన్నారు. గతంలో అమరావతిపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను కూడా ఈ సందర్భంగా గుర్తు చేశారు. చం ద్రబాబు కడప పర్యటన ప్రధానంగా వైఎస్ జగన్ ను విమర్శించేందుకే పరిమితమైందని అవినాష్ రెడ్డి ఆరోపించారు. రాయల సీమకు నీటి ప్రాజెక్టు లు దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే సాధ్యమయ్యాయని, గండికోట రిజర్వాయర్ సామర్థ్యాన్ని 6 టీఎంసీలకు పరిమితం చేస్తూ జీవో ఇచ్చింది చంద్రబాబేనని విమర్శించారు. మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డిపై కూడా అవినాష్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వైఎస్ కుటుం బం అండతో రాజకీయంగా ఎదిగిన వ్యక్తి ఇప్పుడు అదే కుటుంబంపై విమర్శలు చేయడం బాధాక రమన్నారు. భవిష్యత్తులో ప్రజలే తగిన సమాధా నం చెబుతారని, ఆయన స్వగ్రామంలోనే మళ్లీ వైఎ స్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసే రోజు వస్తుందని వ్యాఖ్యానించారు.

# అవినాష్ రెడ్డి వ్యాఖ్యలు అర్థ రహితం

**పులివెందుల, జూలై 4, ప్రభాత వార్త :**



కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని పులివెం దుల టీడీపీ సోషల్ మీడియా ఇంచార్జ్ వర్ధన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. శనివారం ఆయన మీడియా తో మాట్లాడుతూ ఆదినారాయణ రెడ్డి రాజకీయ ప్రస్థానం గురించి అవినాష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని ఆ యన ఆరోపించారు. వైఎస్సార్ రాజకీయ జీవితంలో ఆదినారాయణరెడ్డికు టుంబం కీలకపాత్ర పోషించిందని, చరిత్రను వక్రీకరిస్తూ వ్యక్తిగత విమర్శలు చేయడం తగదన్నారు. రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే అవినాష్ రెడ్డి ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. చరిత్ర తెలుసుకుని బాధ్యతాయుతంగా మాట్లాడాలని అవినాష్ రెడ్డికి వర్ధన్ రెడ్డి సూచించారు. వ్యక్తిగత దూషణలు, అవమానకర వ్యాఖ్యలను మానుకోవాలని ఆయన కోరారు.

# 50% సబ్సిడీతో కంది విత్తనాలు

**పులివెందుల, జూలై 4, ప్రభాత వార్త**

పులివెందుల మండలంలో కంది పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై కంది విత్తనాలను అందించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి వి. చెన్నారెడ్డి తెలిపారు. ఈ పథకం కింద లబ్ధి పొందాలనుకునే రైతులు తమకు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. పులివెందుల మండలానికి మొత్తం 30 క్వింటాళ్ల కంది విత్తనాలు మంజూరైనట్లు తెలిపారు. నాలుగు కిలోల బరువున్న ఒక్కో విత్తన ప్యాకెట్ పూర్తి ధర రూ.492 కాగా, ప్రభుత్వం రూ.240 సబ్సిడీ అందిస్తోందన్నారు. దీంతో రైతులు ఒక్కో 4 కిలోల ప్యాకెట్‌కు రూ.252 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. రైతు సాగు చేసే భూమి విస్తీర్ణాన్ని ఆధారంగా చేసుకుని గరిష్టంగా మూడు విత్తన ప్యాకెట్లు అందజేస్తామని తెలిపారు. కంది సాగు చేయాలనుకునే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కోరారు.

# కారు అబ్రహాంకు ఘన నివాళి

**కలసపాడు, జూలై 4 ప్రభాతవార్త:**

కలసపాడుకు చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కారు అబ్రహం(82) కు శనివారం పలువురు నివాళులు అర్పించారు. కారు అబ్రహం సి.ఎస్.ఐ చర్చి ఆవరణలోని ఎస్పీజీ ప్రాథమికోన్నత పాఠశాలలో 36 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగారు. ఆయన శనివారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతి చెందారు. కారు అబ్రహం అంత్యక్రియలు కలసపాడులో ఆదివారం నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు ఉపాధ్యాయుడు కారు ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# తహసిల్దార్ బదిలీ... బాధ్యతలు స్వీకరణ

**దువ్వూరు, జూలై 04, ప్రభాతవార్త:**



దువ్వూరు మండల తహసిల్దార్ సంజీవరెడ్డి శనివారం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కడప కలెక్టరేట్‌లో పని చేస్తున్న బి.సునీత తాసిల్దారుగా శనివారం బాధ్యతలు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి..దువ్వూరు తహసిల్దారుగా పనిచేస్తున్న సంజీవరెడ్డిని బదిలీ చేశారు. ఆయన స్థానంలో కడప కలెక్టరేట్ లో గాలేరునగరి ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ తహసిల్దారుగా పనిచేస్తున్న బి.సునీతను పదోన్నతి పై దువ్వూరు తహసిల్దార్‌గా నియమించారు. తాసిల్దార్ నియమితులైన సునీత మాట్లాడుతూ రైతులకు, విద్యార్థులకు, ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సేవలు అందిస్తామని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇక్కడ తహసిల్దారుగా పనిచేస్తున్న సంజీవరెడ్డిని ఎక్కడికి బదిలీ చేసినారో వివరాలు తెలియ రాలేదు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసిల్దారును సిబ్బంది, వీఆర్వోలు కలిశారు.

# ఎస్సైగా మహేష్ బాధ్యతలు..

**సుండుపల్లె, జూలై 04,ప్రభాతవార్త :**

సుండుపల్లె పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్సైగా పి. మహేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు పోలీస్ సిబ్బంది మరియు స్థానికులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, సమస్యలు ఉంటే నిర్భయంగా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాలని సూచించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఆయన, ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రజల సహకారంతో మండలంలో ప్రశాంత వాతావరణం కొనసాగించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# సోమలగడ్డలో వ్యక్తిపై దాడి

## జనసేన నాయకుడు శ్రీరామాంజనేయులు పరామర్శ

**మదనపల్లె క్రైం, జూలై 4 ప్రభాతవార్త.**

మదనపల్లి మండలం సిటిఎం పంచాయతీ పరిధిలోని సోమలగడ్డ గ్రామంలో శనివారం ఓ వ్యక్తిపై దాడి జరిగింది. స్థానికుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన రెడ్డప్ప కుమారుడు కె. దిలీప్ కుమార్ (44) పై అదే గ్రామానికి చెందిన రాజు, అభి, తేజ అనే వ్యక్తులు బీరు బాటిళ్లు, కర్రలతో తీవ్రంగా దాడి చేసి గాయపరిచారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన దిలీప్ కుమార్‌ను చికిత్స నిమిత్తం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దిలీప్ కుమార్‌ను మదనపల్లి జనసేన పార్టీ నాయకులు శ్రీరామాంజనేయులు శనివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరామాంజనేయులు మాట్లాడుతూ... బాధితుడి కుటుంబానికి జనసేన పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గ్రామంలో ఇలాంటి దాడులకు పాల్పడటం దుర్మార్గం అని, పోలీసులు వెంటనే స్పందించి దాడి చేసిన రాజు, అభి తేజలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు జనసేన పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు.



# ఆదర్శ పాఠశాలను సందర్శించిన అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్



ల్యాబ్‌లు, వొకేషనల్ ఎక్విప్‌మెంట్, పాల్ ల్యాబ్‌లు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, సీసీ కెమెరాల పనితీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు తదితర అంశాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. తదనంతరం 10వ తరగతి విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, సమగ్ర శిక్ష మరియు పీఎం శ్రీ పథకం కింద ప్రభుత్వం కల్పిస్తున్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యాలు, విలువలు, క్రమశిక్షణను పెంపొందించుకొని సర్వతోముఖ అభివృద్ధి సాధించాలని సూచించారు. విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు పాఠశాల యాజమాన్యం సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రెడ్డి భాషా, పాఠశాల ప్రిన్సిపల్ మూడే శీను నాయక్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చెన్నూరు బాలాజీ, పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ రెడ్డి భాషా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


**పేరు మార్పు**

షేక్ మహమ్మద్ రసూల్ తండ్రి షేక్ అన్వర్ భాష, ఇంటి నెంబర్: 8-480-6-7 సాయి నగర్, రాజంపేట మున్సిపాలిటీ, కడప (జిల్లా) ఏపీ., నా పాస్పోర్ట్ నెంబర్: T5215519 మా భార్య పేరు పొరపాటున షహబానా షేక్ గా ఉన్నది మా భార్య ఒరిజినల్ పేరు షేక్ షబానా బేగం నా భార్య పదవ తరగతి సర్టిఫికెట్ ప్రకారం గమనించగలరు.

**డాక్యుమెంట్లు పోయినవి**

కడప జిల్లా, పొద్దుటూరు టౌన్, ఎర్రగుంట్ల రోడ్డు, ఆదర్శ కాలనీలోని డోర్ నెంబర్ 20-175-1లో నివాసం ఉంటున్న కొవ్వూరు రమేష్ రెడ్డి సన్నాఫ్ కొవ్వూరు రామ సుబ్బారెడ్డి గారికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు నెంబర్ 12685/2023 తేదీ 5.9.2023 మరియు డాక్యుమెంట్ నెంబర్ 12687/2023 తేదీ 5.9.2023, తేదీ 13.6.2026న మైదుకూరు రోడ్డు నుండి గౌరమ్మ కట్ట వీధికి జిన్నా రోడ్డు మార్గాన వస్తుండగా పోయినది. దొరికిన వారు కింది నెంబర్ కు తెలియజేయగలరు.
సెల్ , 9440623822

## అందుబాటులో యూరియా, డీఏపీ ఎరువులు

**ముద్దనూరు, జులై 04 (ప్రభాతవార్త):**



మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియా, డీఏపీ ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. కొలవలి రైతు సేవా కేంద్రంలో నిల్వకు వచ్చిన డీఏపీ ఎరువులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఏపీ ఎయిమ్స్-2.0 యాప్‌లో నమోదైన పంటల వివరాల ఆధారంగానే రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. గత ఏడాది సాగు వివరాలు, ప్రస్తుత పంట నమోదు సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకొని ప్రతి రైతుకు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎరువులు అందజేస్తున్నామని వివరించారు. రైతులందరికీ సమాన అవకాశాలు కల్పించేలా పంపిణీ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే ఖరీఫ్ పంటలు సాగు చేసిన రైతులు తమ పంటల వివరాలను సమీప రైతు సేవా కేంద్ర సిబ్బంది ద్వారా తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట నమోదు పూర్తయితేనే ఎరువుల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని ఆయన స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి అపోహలకు గురికాకుండా, అవసరమైన ఎరువులను రైతు సేవాతి కేంద్రాల ద్వారా పొందాలని మండల వ్యవసాయ అధికారి విజ్ఞప్తి చేశారు.

## మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానం

**లక్కిరెడ్డిపల్లి జూలై 4 ప్రభాతవార్త**

మండలంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5 వ తరగతి నుంచి 9 తరగతి వరకు మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ విజయ ఒక ప్రకటనలో తెలిపారు 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో ఓబీసీకి రెండు సీట్లు ఎస్సీకి 48 సీట్లు 6 తరగతులు ఓసీకి 1 ఎస్సీకి 19 సీట్లు 7 వ తరగతిలో ఎస్సీకి నాలుగు సీట్లు 9వ తరగతిలో ఎస్సీ కైట్ సీట్లు ఉన్నాయని అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆమె తెలియజేశారు సరాసరి అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించి సమస్యలు తెలుసుకోవచ్చు అన్నారు.

## ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారి రైతులు

**చౌడేపల్లి జూలై 4 ప్రభాతవార్త**

రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి మోహన్ కుమార్ కోరారు శనివారం ఎల్ నినో ప్రభావం గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా మోహన్ కుమార్ ప్రసంగిస్తూ ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదవుతుందన్నారు. వడగాలులు ఎక్కువగా ఉంటాయన్నారు దీనిని ఎదుర్కోవడానికి వరి సాగుకు బదులుగా తక్కువ కాలంలో పండే,బెట్ట పరిస్థితులను ఎదుర్కొనే జొన్న, సజ్జ, రాగులు లాంటి పంటలను సాగు చేసుకోవాలన్నారు . ప్రీ మన్సూన్ డ్రై సోయింగ్ వర్షాలకు ఒకటి రెండు వారాల ముందే పొడి నేలలో విత్తనాలు నాటడం వల్ల వేర్లు బలంగా పెరిగి బెట్టను తట్టుకుంటాయన్నారు ఈ కార్యక్రమంలో ఎస్టి రైతులకు 50% సబ్సిడీ కింద కంది విత్తనాలు అందజేయడం జరిగిందన్నారు బోరు బావులు కలిగిన రైతులు డ్రిప్ ఇరిగేషన్ ప్రభుత్వం ఇచ్చే రాయితీతో డ్రిప్పు పరికరాలు అమర్చుకొని తక్కువ నీటితో ఎక్కువ సాగు చేసుకోవచ్చని అధిక దిగుబడి పొందవచ్చని తెలియజేశారు. ర్యాలీలో వ్యవసాయ డి ఆర్ డి ఏ ఏపిఎం సుబ్రమణ్యం సంఘమిత్ర సభ్యులు రైతులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో రోశయ్యకు నివాళులు

**పీలేరు జూలై 4 ప్రభాతవార్త:**



మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ దివంగత కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను పీలేరు పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాయలసీమ ఆర్యవైశ్య మహాసభ జోనల్ చైర్మెన్ బలసా వేణుగోపాల్ హాజరై కొణిజేటి రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బలసా వేణుగోపాల్ మాట్లాడుతూ దివంగత కొణిజేటి రోశయ్య సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో ఉన్నత పదవులు నిర్వహించి ప్రజాసేవలో ఆదర్శంగా నిలిచారు. ఆయన చూపిన బాటలో యువత నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా తిజువీశితి అధ్యక్షులు శ్రీనివాసులు, నరసింహులు శెట్టి, వినోద్, బాలసుబ్రమణ్యం, మల్లి, మాదాలం సీను, విజయ మహేష్, సురేష్, రేవూరి నాగరాజు, ఆనంద్ ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దేవుళ్ళ పేరుతో భూ కబ్జాలు

**సిద్ధవటం, జూలై 4 ప్రభాతవార్త**




దేవుళ్ళ విగ్రహాలు పెట్టి ప్రభుత్వ స్థలాలు, కొండలు యదేచ్ఛగా తవ్వకాలు చేపట్టిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు మండలంలోని కడప చెన్నై జాతీయ రహదారి శనీశ్వర స్వామి గుడి ప్రక్కన కడప నగరానికి చెందిన వ్యక్తి దేవుళ్ళ విగ్రహాలు పెట్టి కనుములోపల్లి రెవిన్యూ పొలంలో70/3 సర్వే నెంబర్లో ప్రభుత్వ రెవెన్యూ కొండ, పోరంబోకు, వంకలు జెసిబి యంత్రాలతో పూడ్చివేసి ఆక్రమిత పట్టపగలే చేస్తున్న అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు దేవుళ్ళ పేరుతో ప్రభుత్వ స్థలాలు కొండలు అన్యాక్రాంతం చేయడంపై పలువురు మండి పడ్డారు స్థానికులు కొంతమంది కడప ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రసాద్ కు చరవాణి ద్వారా ఫిర్యాదు చేయగా ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రసాద్ ఆదేశాలు ఫారెస్ట్ రేంజ్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు పరిశీలించి పనులు నిలిపేశారు, రెవెన్యూ, ఫారెస్ట్ స్థలాలు సర్వే చేసేంతవరకు చేయవద్దని తెలుపుడల చేశారు వీఆర్వో హరి కృష్ణ వివరణ కోరగా కనుమలోపల్లి రెవెన్యూ సర్వేనెంబర్70/3 నందు ఎలాంటి పనులు చేయకూడదని స్థలం వివాదంగా ఉందని హెచ్చరిక బోర్డు నాటించామని మండల తాసిల్దార్ విజయ్ కుమార్ ఆదేశాలతో ఆ స్థలాన్ని పరిశీలించి కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## నాయీ బ్రాహ్మణుల నియామకంపై జాప్యం తగదు

### బిజెపి నేత గాలి హరిప్రసాద్



**వేంపల్లె: జూలై 04 ప్రభాతవార్త**

స్థానిక శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయాల్లో నాయీ బ్రాహ్మణుల నియామకంపై జాప్యం తగదని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. శనివారం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కడప సుభాష్‌కి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వంద కోట్ల ఆస్తులు కలిగి, ప్రతి ఏటా కోటి రూపాయలు దేవస్థానానికి ఆదాయం వస్తుందని, అయితే సాంకేతిక కారణాలు బూచిగా చూపుతూ గత ప్రభుత్వం వీరిని తొలగించారని ఆరోపించారు. ఆరు నెలలుగా ఆలయాల్లో నాయీ బ్రాహ్మణులను నియమించాలని కోరుతున్న అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. భక్తులు వేసే కానుకల ద్వారా జీతాలు తీసుకునే అధికారులు, స్వామికి పూజా కైంకర్యాల్లో భజంత్రీలను నియమించడంపై జాప్యం చేయడం ఏమిటని? ప్రశ్నించారు. కేవలం ప్రాకారోత్సవం జరిగే రోజుల్లో మాత్రమే భజంత్రీలను వినియోగించుకొని మిగతా రోజుల్లో వీరిని ఎందుకు నియమించ లేదన్నారు. ఇప్పటికైనా వీటన్నింటిపై దృష్టి పెట్టాలని, నాయీ బ్రాహ్మణులను తప్పనిసరిగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు లక్ష్మిరెడ్డి, పుష్పలత, రంగారెడ్డి, సురేష్, దశరథ, విహెచ్ పి నేతలు విశ్వనాథ్ రెడ్డి, చలమా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో బోరు రిపేరు

**వేంపల్లి జూలై 04 ప్రభాతవార్త**



మండలంలోని కుమ్మరాంపల్లెలో గత ఐదు సంవత్సరాలుగా రిపేర్‌లో ఉన్న బోరు ను ఆ గ్రామ టీడీపీ ఇంచార్జి మాజి ఆర్మీ రెడ్డయ్య గురించి గ్రామ ప్రజలు టిడిపి ఇంచార్జ్ ఆర్మీ రెడ్డయ్య తన సొంత నిధుల తో బోరు ను రిపేరు చేయించారు,, ఈ సందర్భంగా కుమ్మరాంపల్లి గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఆయన తక్షణం స్పందించి తన సొంత నిధులతో బోరుకు కావలసిన కొత్త పైపులు మరియు బోరింగ్ వేయించి మంచి నీటి సౌకర్యం కలిపించారు,దీంతో గ్రామ ప్రజలు ఆయన సేవలను చూసి హర్షం వ్యక్తం చేశారు.

### ప్రైవేటు పాఠశాలలో ఫీజుల వివరాలు

## నోటీసు బోర్డులో ఉండాలి

### మండల విద్యాశాఖ అధికారి బాబు నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ బాబు నాయక్

**పీలేరు జూలై 4 ప్రభాతవార్త:**

ప్రైవేటు పాఠశాలలో ఫీజులు వివరాలను నోటీసు బోర్డులో ఉండాలని పీలేరు మండల విద్యాశాఖాధికారి బాబు నాయక్ అన్నారు. స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో శనివారం పీలేరు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యులు, ప్రధానోపాధ్యాయుల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖాధికారి బాబు నాయక్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలకి తప్పనిసరిగా ప్రభుత్వ గుర్తింపు, ప్రైవేటు పాఠశాల బస్సులకు ఫిట్నెస్ సర్టిఫికెట్స్, ప్రభుత్వ గుర్తింపు ఇచ్చిన పాఠశాల బోర్డును, తరగతివారీగా నిర్ణయించిన ఫీజులను నోటీసు బోర్డు లోను అతికించాలని, ప్రభుత్వం గుర్తింపు లేని పేర్లతో పాఠశాలల నడపరాదని, అధిక ఫీజులు వసూలు చేసిన వారిపై చర్య తీసుకుంటామని తెలియజేశారు. అలాగే మండల విద్యాశాఖాధికారిణి పద్మావతి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలో పుస్తకాలను తదితర విద్యా సామాగ్రిని అనుమతి లేనిదే అమ్మ రాదని, ప్రభుత్వం నీయమ నిబంధనల లోబడి పని చేయాలని, ప్రభుత్వ సెలవు రోజుల్లో పాఠశాలలు నిర్వహించరాదని, పాఠశాల సమయం దాటాక ఎలాంటి తరగతుల నిర్వహించరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిలు జలకనూరి మురళీధర్ రాజు మాధవి, అశోక్, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది శిరీష తాజూన్, సత్యనారాయణ మరియు వివిధ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యులు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

### రాష్ట్రంలో కూటమి నాయకుల

## అనుచిత వ్యాఖ్యలకు అంతే లేదు

**ప్రొద్దుటూరు జూలై 4 ప్రభాతవార్త**



రాష్ట్రంలో కూటమి నాయకుల అనుచిత వ్యాఖ్యలకు అంతే లేకుండా పోయిందని ఇటీవల చంద్రగిరి ఎమ్మెల్యే పులవర్తి నాని ఒక న్యాయవాది భూములను ఆక్రమించడమే కాకుండా ఇష్టమొచ్చిన రీతిలో దుర్భాషలాడారని ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం తన నివాసంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నుండి అధికారంలో వున్న తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ ఎమ్మెల్యేల వరకు జుగుప్సాకరమైన బాషను వాడుతూ ప్రజలు అసహ్యించుకొనేలా వ్యవహరిస్తూ ప్రశ్నించే ప్రతిపక్షాలపై కేసులు పెడుతూ పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు స్వంత నియోజకవర్గం అయిన తిరుపతి జిల్లా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ద్వారకనాథరెడ్డి అనే రిటైర్డ్ ఉద్యోగికి చెందిన సుమారు 3.17 ఎకరాల భూమిని కబ్జా చేసి వారిని భయభ్రాంతులకు గురి చేయడంతో పాటు, అతని తరపున వాదించే రిటైర్డ్ జడ్జి, ప్రస్తుత న్యాయవాది ని కూడా దూషించి బెదిరింపులకు పాల్పడుతున్నారని వివరించారు. ఆ న్యాయవాది ఈ విషయమై తనకు ప్రాణ రక్షణ కావాలని పోలీసులను కూడా ఆశ్రయించారని గుర్తు చేశారు. కాగా కబ్జా విషయమై నిరసన వ్యక్తం చేసిన ప్రజా సంఘాల నాయకులు, వైసీపీ, కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం మీడియా కు తెలిస్తే కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ లోకేష్ రెడ్డి ని ఈ విషయంలో మిన్నకుండాలని పులివర్తి నాని తెలుపుతూ జడ్జిని దూషించారన్నారు. పోలీసులు కూడా అధికార పార్టీ వారికి వత్తాసు పలకడం సరికాదన్నారు. కాగా ప్రజలు అన్ని విషయాలు గమనించి ఓట్లు వేయాలని సూచించారు.

## గండి అంజన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

**వేంపల్లి జూలై 04 ప్రభాతవార్త**

స్థానిక గండిక్షేత్రంలోని అంజన్న స్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. శనివారం ఆలయ ప్రధాన అర్చకుడు కేసరి స్వామి ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున నుంచే గండిక్షేత్రానికి చేరుకున్న భక్తులు పాపాగ్నినదిలో పుణ్య స్నానాలు ఆచరించి, స్వామిని దర్శించుకున్నారు. అలాగే భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆగస్టు నెలలో జరిగే శ్రావణమాస ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తారని, వీరికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా తగు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి విశ్వనాథ్, పాలక మండలి చైర్మన్ వెంకటస్వామి వెల్లడించారు. అంతేకాకుండా నిత్యాన్నదాన పథకం ద్వారా భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు.



## ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు

### హిటాచీ, రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్న వీఆర్వో

**నందలూరు, జూలై 4 ప్రభాతవార్త :**

మండలంలోని కుందా నెల్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని కుమారునిపల్లి చెయ్యేరు ఇసుక క్వారీలో అక్రమంగా ఇసుక తరలింపును శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. జూన్ 1 నుంచి ఆగస్టు 15 వరకు క్వారీ నుంచి ఇసుక తరలించరాదని జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, వాటికి విరుద్ధంగా హిటాచీ యంత్రాలతో ఇసుకను టిప్పర్లకు అధిక లోడుతో పగలు, రాత్రి తేడా లేకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సిద్ధవరం గోపిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు టిప్పర్లను అడ్డుకుని అధికారులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా గోపిరెడ్డి మాట్లాడుతూ అక్రమ ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనుమతులకు విరుద్ధంగా సుమారు 20 అడుగుల లోతు వరకు ఇసుక తవ్వి టిప్పర్ల ద్వారా



తరలిస్తున్నారని ఆరోపిస్తూ, అధికారులు అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న టంగుటూరు వీఆర్వో శివ క్వారీ వద్దకు చేరుకుని ఇసుక లోడింగ్ చేస్తున్న హిటాచీ యంత్రంతో పాటు రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలు చేపట్టారు.

## ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కార్యక్రమం

### తక్కువ నీటి పంటలు వేసి ఆదాయం పెంచుకోవాలని వ్యవసాయ అధికారుల సూచనలు

**పీలేరు జూలై 4 ప్రభాతవార్త:**



పీలేరు ఎల్ నినో ప్రభావంతో ఖరీఫ్ సీజన్‌లో ఏర్పడే నీటి ఎద్దడిని తట్టుకునేందుకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. పీలేరు మండలం బోడుమల్లు వారి పల్లి రైతు సేవా కేంద్రం పరిధిలోని మొరవడి పల్లి గ్రామంలో వ్యవసాయ, అనుబంధ శాఖలు, హార్టికల్చర్, అగ్రికల్చరల్, ఏపీ సీఎన్‌ఎఫ్, డి.ఆర్.డి.ఏ శాఖల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీలేరు సహాయ వ్యవసాయ సంచాలకులు కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎల్ నినో కారణంగా వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉంది. కాబట్టి రైతులు తక్కువ నీరు అవసరమయ్యే చిరుధాన్యాలు, కూరగాయలు, పప్పు ధాన్యాలను సాగు చేసి నిరంతరం ఆదాయం పొందాలని తెలిపారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి రమాదేవి మాట్లాడుతూ రైతులు తుంపర, బిందు సేద్య పద్ధతులను అవలంబించాలి. నీటి ఎద్దడిని తట్టుకునే వంగడాలను ఎంపిక చేసుకుని సాగు చేస్తే ఎల్ నినో ప్రభావాన్ని సమర్థంగా అధిగమించవచ్చని సూచించారు. పీలేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ మాట్లాడుతూ పురం రామమూర్తి ప్రత్యామ్నాయ పంటల సాగుతో పాటు మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలు వేస్తే రైతులకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ సుకుమార్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ లు అమర్నాథ్ రెడ్డి, గోళ్ళ కిషోర్ నాయుడు, బాబు చిరంజీవి, అబ్బు వెంకటేష్, ఏఈఓ జహీర్, బిందు, ఎల్ నినో సిబ్బంది, సంఘమిత్రులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సర్ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీపై విచారణ జరపాలి

### జిల్లా కలెక్టర్‌కు వైకాపా నాయకులు వినతి

**మదనపల్లె, జులై 4 ప్రభాతవార్త :**



కలెక్టర్‌కు విన్నవిస్తున్న వైకాపా నాయకులు

సర్ ప్రక్రియకు సంబంధించి బిఎల్‌ఓలు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీపై విచారణ జరపాలని వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్, మేథావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వివిఎస్.రెడ్డిలు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్‌లో వారు జిల్లా కలెక్టర్‌కు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీకి సంబంధించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్ ప్రక్రియకు సంబంధించి మదనపల్లె నియోజకవర్గంలో ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ వందశాతం పూర్తి అయ్యిందని చెప్పడం వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా ఉందన్నారు. బూత్‌లెవల్ ఏజెంట్లు, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధుల ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం నియోజకవర్గంలో కేవలం 70నుంచి 80శాతం వరకే ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ జరిగినట్లు తెలిసిందన్నారు. ఇంకా అనేక గ్రామాలు, పట్టణంలోని వార్డుల్లో అర్హులైన ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందలేదన్నారు. వలస కూలీలు, ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు, తాళం వేసి ఉన్న ఇళు, తరచూ అద్దెకు మారే వంటి ఇళ్ళల్లో వందశాతం పంపిణీ జరగలేదని వారు తెలిపారు. జిల్లా ఎన్నికల యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి అర్హులైన వారందరికి వెంటనే ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయాలని కోరారు. ఓటరు జాబితా సమరణ ప్రక్రియ పారదర్శకంగా, నిస్పక్షపాతంగా జరగాలన్నారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొన్న బొలోరో

**సిద్ధవటం, జులై 4 ప్రభాతవార్త**



కడప చెన్నై జాతీయ రహదారి వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఘటనలో బోలోరా వాహనం దెబ్బతింది హైవేపై పెను ప్రమాదం తప్పడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. మండలంలోని బాకరాపేట గ్రామంలోని జాతీయ రహదారి చర్చి సమీపాన శనివారం ఉదయం, 3 గంటల సమయంలో ఆగ్రా నుండి తిరుపతికి కాటన్ తీసుకెళ్తున్న లారీ డ్రైవర్ కు నిద్ర రావడంతో లారీని రోడ్డు పక్కకు ఆపి ఉన్నాడు అదే సమయంలో ఆగి ఉన్న లారీని గమనించకుండా బొలెరో వాహనం డ్రైవర్ సంజీవ రాయుడు ఢీకొట్టడంతో బొలెరో వాహనం పాక్షికంగా దెబ్బతింది ప్రమాదం జరిగిన సంఘటన స్థలానికి హైవే పెట్రోలింగ్ పోలీసులు చేరుకొని విచారించారు. డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడం వల్ల ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు జరిగిన సంఘటనపై విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

## విఆర్‌ఎస్‌ఎస్‌చే 13న నిరసన ర్యాలీ

### పోస్టర్లు ఆవిష్కరించిన నాయకులు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

**మదనపల్లె, జులై 4 ప్రభాతవార్త :**

వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 13న ఎస్‌టి జాబితా పునరుద్దరణ కోసం శాంతియుత నిరసన ర్యాలీ తలపెట్టడం జరిగిందని రాష్ట్ర అధ్యక్షులు పొదల నరసింహులు తెలిపారు. శనివారం వాల్మీకి నాయకులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహం వద్ద పోస్టర్లను ప్రదర్శించి కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో వాల్మీకులకు ఇచ్చిన ఎస్‌టి పునరుద్దరణ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతియుత ర్యాలీలో వాల్మీకులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. వాల్మీకి బిడ్డల భవిష్యత్తు కోసం ఎస్‌టి పునరుద్దరణ కోసం చేస్తున్న ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఎన్‌టిఆర్ సర్కిల్ నుంచి ర్యాలీ జిల్లా కలెక్టర్ వరకు జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు విష్ణుచైతన్య, శ్రీరాములు, గౌరమ్మ, గాయత్రి, భరత్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అల్లూరు సీతారామరాజు జయంతి

**మదనపల్లె, జులై 4 ప్రభాతవార్త :**

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి శనివారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి డిఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డితో కలసి కలెక్టర్ నిశాంత్‌కుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు చిన్నవయసులోనే దేశభక్తి భావాలతో ప్రజల పక్షాన నిలిచారన్నారు. బ్రిటీష్‌పాలనలో గిరిజనులపై జరుగుతున్న అన్యాయాలు, అణిచివేత, వారి హక్కుల అనిణివేతను గుర్తించి వ్యతిరేకంగా పోరాటానికి శ్రీకారం చుట్టారన్నారు. అల్లూరు దేశభక్తి, ధైర్యాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దేశం కోసం, ప్రజల హక్కుకోసం ప్రాణాలు అర్పించిన అల్లూరి సీతారామరాజు త్యాగం చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారి నాగభూషణం, నాగయ్య, కలెక్టర్ కార్యాలయ ఏఓ నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న దృశ్యం

## సివిల్ సప్లై డైరెక్టర్‌గా డాక్టర్ వైఎస్.మునిరత్నం

**మదనపల్లె, జులై 4 ప్రభాతవార్త :**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహారం వినియోగదారులు హక్కుల, పౌరసరఫరాల విజిలెన్స్ శాఖ రాష్ట్ర కమిటీ సభ్యునిగా డాక్టర్ వైఎస్. మునిరత్నంను నియామకం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖకు సంబంధించి నిస్వార్థంగా సేవలు అందిస్తానన్నారు. తాను గతంలో బిటి కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేయడం జరిగిందన్నారు. ఈ శాఖ ద్వారా ప్రజలకు సేవ చేయడానికి అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు, మంత్రి నాదేండ్ల మనోహర్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జనసేన పార్టీ కోకన్వీనర్ రాందాస్‌చౌదరి, జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్‌లకు అభినందనలు తెలిపారు.

## విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు :ఎమ్మెల్యే



ఉద్యోగులను విచారిస్తున్న ఎమ్మెల్యే

**మదనపల్లె, జులై 4 ప్రభాతవార్త :**

సచివాలయ ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శనివారం పట్టణంలోని ప్యారానగర్, ఇందిరానగర్ సిచివాలయాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల అందుబాటులో లేకపోవడంతో హాజరు పట్టికను పరిశీలించి ఆగ్రహం చెందారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా సర్ ప్రక్రియసర్వేను వేగవంతం చేసి ఈనెల 14వతేది లోపు పూర్తి చేసే విధంగా ఉద్యోగులు పనితీరును మార్చుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు జనగణన, ఓటర్‌లిస్టు సర్వేలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. శనివారం ఉదయం ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లపై ఏపిజేఏసి జిల్లా ఛైర్మెన్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో డిమాండ్లపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేలా ఎమ్మెల్యే చొరవ చూపాలని కోరారు. ఉద్యోగుల డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి చర్యలు తీసుకొంటానని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## ఉపాధి కూలీలకు అన్యాయం

### కేంద్రంపై ఒత్తిడి తేవడంలో కూటమి ప్రభుత్వం విఫలం

**బద్వేలు, జూలై 4, ప్రభాతవార్త**




ఉపాధి హామీ కూలీల వేతనాల పెంపులో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్.చంద్రశేఖర్ ఆరోపించారు. శనివారం స్థానిక భగత్‌సింగ్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో ఉపాధి కూలీల వేతనాలను భారీగా పెంచగా, ఆంధ్రప్రదేశ్‌లో కేవలం రూ. 5 మాత్రమే పెంచడం ఉపాధి కూలీల పొట్ట కొట్టడమేన్నారు. ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాలకు చాలా తక్కువగా నిధులు కేటాయిస్తున్నారని విమర్శించారు. రాజకీయ కక్షతో రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల ఉపాధి జాబ్ కార్డులను అక్రమంగా తొలగించారని ఆరోపించారు. రాష్ట్ర వాటా 40% నిధులు ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని, ప్రజల తరపున సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాజీలేని పోరాటం చేస్తుందని తెలిపారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కె.జకరయ్య, బి. అనిల్, ఏరియా కమిటీ సభ్యులు కె.బాబు, రామరాజు, విజయరావు, జయరామరాజు, గంట మహబూబ్ బాషా, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సంజీవరాయ స్వామిని దర్శించుకున్న అశేష భక్తులు

**రాజుపాలెం, జులై 4, ప్రభాతవార్త.**



మండల పరిధిలోని ఎల్లాల పుణ్యక్షేత్రంలో గల శ్రీ సంజీవరాయ స్వామిని శనివారం అశేష భక్తజన సందోహం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణం పూర్తిచేసుకుని రెండు రోజుల క్రితం సంజీవ రాయ స్వామికి మహాకుంభాభిషేకం నిర్వహించి ఆలయ ప్రారంభం తర్వాత వచ్చిన మొదటి శనివారం కావడంతో మూలవిరాట్ శ్రీ సంజీవరాయ స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించుటకు పెద్ద సంఖ్యలో భక్తులు రావటంతో వెల్లాలా పుణ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడినది. నూతన ఆలయము మూలవిరాట్ శ్రీ సంజీవరాయ స్వామి పునర్దర్శనము తో భక్తులు ఎంతో భక్తితో పూజలు నిర్వహించారు. ఆలయంలో భక్తుల దర్శనార్థం ప్రత్యేక ఏర్పాట్లు గావించారు.

## సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి : ఆర్‌డీఓ

**ముద్దనూరు, జూలై 4 ప్రభాతవార్త**





ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జమ్మలమడుగు ఆర్డిఓ సంబంధిత అధికారులను ఆదేశించారు. ముద్దనూరు మండలంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని శనివారం జమ్మలమడుగు ఆర్డిఓ శిరీష తహసీల్దారు ఎం.డి. అలీ ఖాన్‌తో కలిసి పరిశీలించారు. శిబిరానికి వచ్చిన ఓటర్లతో మాట్లాడి వారి సందేహాలను తెలుసుకొని, గణన పత్రాల నింపడం, వివరాల నమోదు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ శిరీష మాట్లాడుతూ, సర్ ప్రక్రియ విజయవంతం కావాలంటే ఓటర్లు బూత్ స్థాయి అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. వివరాలకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉన్న వారు ఆదివారం తమ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, ప్రతి దశను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సర్ ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## జూలై 6 న రాష్ట్రస్థాయి
## టెన్నీకాయిట్ పోటీలకు జట్ల ఎంపిక

**పులివెందుల, జూలై 4, ప్రభాత వార్త :**

రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలకు జట్ల ఎంపికను ఈ నెల 6 వ తేదీన కడప డీఎస్ డీఓ ఇండోర్ స్టేడియంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. రామసు బ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు, మహిళలు 14 సంవత్సరాల లోపు సబ్ జూనియర్ బాలబాలికల విభాగాల్లో జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 01/01/2012 తరువాత పుట్టిన వాళ్ళు అర్హులు అని ప్రతి ఒక్క క్రీడాకారుడు వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్సులను తీసుకురావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 11 నుంచి ప్రకాశం జిల్లా జాగురుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకా రులు కడప డీఎస్ డీఓ ఇండోర్ స్టేడియంకి ఉదయం 11 గంటల లోపు చేరుకోవాలి అని అసోసియేషన్ కార్యదర్శి రమణారెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి లు తెలిపారు. మరిన్ని వివరాలకు 94901 37164, 9494947909 ఫోన్ నంబర్లను సంప్రతించాలని వారు కోరారు.

## ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియలో
## ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి



**లక్కిరెడ్డిపల్లి జూలై 4 ప్రభాతవార్త**

ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని ఎస్ జి ఎస్ డబ్ల్యు ఓ అధికారి నాగేంద్ర వరప్రసాద్ పేర్కొన్నారు శనివారం క్లస్టర్ ఇంచార్జి శంకరపు జయరాం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్ ప్రక్రియ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైనదని ఓటు ఆయుధాన్ని ప్రతి ఒక్కరూ సభ్యులను చేసుకోవాలన్నారు ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేయించుకోకుండా ఉన్నవారు వారికి తెలియజేసి ఓటు నమోదు చేయించాలన్నారు. వెరిఫికేషన్ ప్రక్రియకు ప్రతి ఒక్క ఓటరు సహకరించాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ నాగేశ్వరి టిడిపి మండల సీనియర్ నాయకుడు పాపయ్య టిడిపి గ్రామ ఇన్చార్జి జనార్ధన్ రెడ్డి చింతకాయ వెంకటరామిరెడ్డి బిఎల్వోలు ఓటర్లు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ వేగవంతం

### గడువులోపు పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశం



అధికారులకు సూచనలు చేస్తున్న స్పెషల్ ఆఫీసర్ తహసిల్దార్

**పీలేరు జూలై 4 ప్రభాతవార్త:**

ఎన్నికల కమిషన్ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు అన్నమయ్య జిల్లా పీలేరు పట్టణంలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఈ ప్రక్రియలో భాగంగా పీలేరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. బోదేషావలి దర్గా, సి.ఎల్.ఆర్.సి కార్యాలయం, కోటపల్లి పాఠశాల, కటుకల వీధి తో పాటు పట్టణంలోని పలు కేంద్రాల్లో అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ఓటర్ల వివరాల సేకరణ, ధృవీకరణ పనులు చేస్తున్నారు. ఈ సందర్భంగా పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గం వ్యాప్తంగా గడువులోపు ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలి. ఒక్క ఓటరు కూడా మిస్ కాకుండా అందరి పేర్ల నమోదు, సవరణలు జరగాలని" అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బి.ఎల్.ఎ, బి.ఎల్.ఓలు, సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు చురుగ్గా పాల్గొని ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. పీలేరు పట్టణంలో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని తహశీల్దారు శివకుమార్, స్పెషల్ ఆఫీసర్ యుగంధర్, ఆర్ఐ మురగయ్య సర్ కార్యక్రమ కేంద్రాల్ని పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకుని, తప్పులు ఉంటే సరిదిద్దుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## డెంగ్యూ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

**చౌడేపల్లి జూలై 7 ప్రభాతవార్త**

డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిని మోనా కోరారు డెంగ్యూ వ్యతిరేక మాసయోత్సవాల సందర్భంగా స్థానిక బస్టాండ్లో ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా మన ప్రసంగిస్తూ పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీ వ్యాధిని అరికట్టవచ్చని అన్నారు జూలై 1 నుంచి 31 వరకు డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలు జరుగుతాయని తెలిపారు. డెంగ్యూ అనేది ఖిఏడిస్‌ఖి రకం దోమలు కుట్టడం వల్ల వచ్చే ప్రమాదకరమైన వైరల్ జ్వరమని, దీనివల్ల తీవ్రమైన ఒళ్ళు నొప్పులు, రక్తంలో ప్లేట్‌లెట్ల సంఖ్య పడిపోవడం జరుగుతుందని హెచ్చరించారు. దోమకాటు వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఏడిస్ దోమలు మురికి నీటిలో కాకుండా, కేవలం స్వచ్ఛమైన నిల్వ ఉన్న నీటిలోనే పెరుగుతాయన్నారు ఇండ్లల్లోని కూలర్లు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, పూల కుండీలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు డెంగ్యూ సమయంలో శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా పండ్ల రసాలు, కొబ్బరి నీరు, మంచినీరు పుష్కలంగా తాగాలన్నారు బొప్పాయి ఆకు రసం, కివీ పండ్లు, దానిమ్మ వంటివి తీసుకోవడం ద్వారా ప్లేట్‌లెట్ల సంఖ్యను వేగంగా పెంచుకోవచ్చని సూచించారు. సదస్సులో డెంగ్యూతో పాటు మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు, బోధకాలు వంటి ఇతర సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు ఆరోగ్య విద్యను బోధించారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు సబ్ యూనిట్ అధికారి జి. గంగయ్య, పి.హెచ్.ఎన్ గంగులమ్మ, సూపర్వైజర్ సుమతి, ల్యాబ్ టెక్నీషియన్ హేమంత్, ఫార్మసిస్ట్ జయమ్మ, ఏఎన్ఎంలు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## వల్లేరవారిపల్లె లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో
## అంగరంగ వైభవంగా అభిషేక పూజలు





**బద్వేలు, జూలై 4, ప్రభాతవార్త**

బద్వేలు నియోజకవర్గం, గోపవరం మండలం వల్లేరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జ్యేష్ఠ మాసం మూడవ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా జరిగాయి. వేకువజామునే స్వామివారికి అభిషేకం, పూజ, రాహుకాల హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారు, అమ్మవారు తులసి ఆకులతో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు మాట్లాడుతూ, స్వామివారిని దర్శించుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు, చీడపీడలు, నవగ్రహ దోషాలు, ఏలినాటి శని దోషాలు తొలగిపోతాయని, అనుకున్న పనులు సకాలంలో నెరవేరుతున్నాయని తెలిపారు. ఆలయ ఉపాసకులు మాట్లాడుతూ, 11 రోజుల దీక్ష తీసుకోవాలనుకునే భక్తులు జూలై 11వ తేదీన ఆలయంలో దీక్షను స్వీకరించాలని సూచించారు. కార్యక్రమం చివర్లో వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు, స్వామివారి తాంబూలం అందజేశారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామస్థాయి నుండి బలోపేతం చేయడమే లక్ష్యం



**రాయచోటి జులై 4 ప్రభాతవార్త**

గ్రామ స్థాయి నుండి జనసేన పార్టీని బలోపేతం చేయడమే తన లక్ష్యమని అన్నమయ్య జిల్లా రాయచోటి జనసేన పార్టీ నియోజకవర్గం నేత పప్పిరెడ్డి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఆయన శనివారం రాయచోటి లోని జనసేన పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ: గత ఐదు రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమం బాగా జరుగుతోందన్నారు. అందులో భాగంగా జనసేన కార్యకర్తల నుంచి ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నందువలన మరో రెండు రోజులు వ్యవధి పొడిగించినట్లు ఆయన తెలిపారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలో జనసేన పార్టీ తరపున శ్రీనివాసరావు(కే కే)విచ్చేసి అవగాహన కల్పించారన్నారు. ఇందులో భాగంగానే రాయచోటి నియోజకవర్గం పరిధిలోని జనసేన నాయకులకు,కార్యకర్తలకు,వీర మహిళలకు పార్టీ నిర్మాణ సారథ్యం గురించి దిశా నిర్దేశం చేశారు.ఈ క్రమంలోనే రాయచోటి నియోజకవర్గం పరిధిలోని 6 మండలాల్లో జనసేన పార్టీ స్థాపించిన నాటి నుండి పని చేసిన నాయకులు కార్యకర్తలు,మధ్యలో పార్టీలో చేరి కష్టపడుతున్న వారు నియోజవర్గ స్థాయి జనసేన పార్టీ కార్యాలయంలో సంప్రదించి జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.అలాగే గ్రామపంచాయతీ స్థాయి,మండల స్థాయి,నియోజకవర్గ,పార్లమెంట్ స్థాయిలలో పార్టీ కోసం కష్టపడి పని చేస్తూ పదవులు కావాలని ఆసక్తి కలిగిన జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు రాజంపేట జనసేన పార్టీ పార్లమెంట్ కార్యాలయాన్ని సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు.

## సర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేస్తాం : జిల్లా కలెక్టర్

**మదనపల్లె, జులై 4 ప్రభాతవార్త :**

జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పూర్తిగా పారదర్శకంగా, రాజకీయ పార్టీల సహకారంతో గడువులోగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన జాతీయ,రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2002 నాటి ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకొని ప్రస్తుతం ఉన్న ఓటరు వివరాలను సరిపోల్చే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. కుటుంబసభ్యుల వివరాలు, తల్లిదండ్రుల వివరాల ఆదారంగా ఓటర్ల మ్యాపింగ్ చేపడుతున్నారన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 67.39శాతం మ్యాపింగ్ పూర్తి అయ్యిందన్నారు. ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు 99శాతం పంపిణీ చేసినట్లు తెలిపారు. ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియకు ఎన్నికల సంఘం ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్‌చేసి ఓటరు వివరాలు, కుటుంబసభ్యుల సమాచారం నమోదు చేయడంతో పాటు తాజా ఫోటోను కూడా అప్‌లోడ్ చేస్తున్నట్లు వివరించారు. ప్రతిరోజూ సుమారు 63వేల ఫారాలను డిజిటైలేషన్ చేయాలన్న లక్ష్యంతో బిఎల్‌ఓలు పనిచేస్తున్నారు. బిఎల్‌ఓలు సచివాలయ సిబ్బంది ప్రతి ఓటరుకి అవసరమైన మార్గదర్శకతను అందిస్తూ సర్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారన్నారు. బిఎల్‌ఓలు, బూత్ లెవల్ ఏజెట్లు, రాజకీయ పార్టీలు, ఎన్నికల యంత్రాంగం మధ్య నిరంతర సమన్వయం ఉండేలా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ చంద్రశేఖర్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ చల్లాకళ్యాణి, ఆర్‌డిఓ శ్రీనివాస్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## ఆరు కోట్లతో దేవాలయాల నిర్మాణాలు

**గాలివీడు. జూలై 4. ప్రభాతవార్త.**



మండలంలోని వివిధ గ్రామపంచాయతీలలో ఆరు కోట్ల 50 లక్షలతో వివిధ ఆలయాల నిర్మాణాలను చేపట్టినట్లు రాయచోటి నియోజకవర్గం టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం మండలంలోని ఎగువగొట్టి వీడు పంచాయతీ మామిళ్ళవారిపల్లెలో శ్రీవాణి ట్రస్టు ద్వారా 20 లక్షలతో నిర్మించనున్న ఎల్లమ్మతల్లి ఆలయానికి భూమి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడు మండలంలో శ్రీవాణి ట్రస్ట్ కింద 21 గుళ్ళకు నాలుగు కోట్ల రూపాయలు, సిజిఎఫ్ నిధులు రెండు కోట్ల యాభై లక్షలు రూపాయలు నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆలయాలని నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు పార్థసారధి రెడ్డి,, మాజీ ఎంపీటీసీ రెడ్డి ప్రసాద్ రెడ్డి, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి శివారెడ్డి,టిడిపి నాయకులు నాగేశ్వరరావు, శరన్ కుమార్ నాయుడు, రామ్మోహన్ నాయుడు, పెద్ద రెడ్డప్ప నాయుడు పాల్గొన్నారు.

## మినరల్ వాటర్ ప్లాంట్‌కు శ్రీకారం



**బ్రహ్మంగారిమఠం జూలై 04 ప్రభాతవార్త**

మండలంలోని రేకలకుంట పంచాయతీ పరిధిలోని వాంపల్లెచెరువు గ్రామంలో రూ.6.50 లక్షల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి శనివారం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కానాల మల్లికార్జున రెడ్డి భూమిపూజకు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలో ప్రజలకు స్వచ్ఛమైన త్రాగు నీరు అందించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తలపెట్టారని కానాల మల్లికార్జున రెడ్డి తెలిపారు. కానాల మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని అన్నారు. ప్రజలకు అవసరమైన తాగునీటి సౌకర్యాలను మరింత మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అభివృద్ధి పనులను వేగవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రామచంద్రారెడ్డి, ఏపిఒ హరికృష్ణ,పెరుగు నాగేంద్ర, పుటాల శివాయాదవ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



**మైదుకూరు, జులై 04, ప్రభాతవార్త:**

ఏపీఎన్జీజీఓ అసోసియేషన్ కడప జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జేఏసీ ఛైర్మన్ అలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర సెక్రటరీ జనరల్ ప్రసాద్ మరియు రాష్ట్ర జనరల్ సెక్రెటరీ డి.వి. రమణ ఆదేశాల మేరకు కడప జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు మరియు మైదుకూరు తాలూకా అధ్యక్షులు గజ్జల చంద్రమోళి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలపై వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏపీఎన్జీజీఓ జిల్లా అధ్యక్షుడు బి. శ్రీనివాసులు మాట్లాడుతూ పీఆర్సీ కమిటీని తక్షణ మే నియమించాలి, మధ్యంతర భృతిని ప్రకటించాలి,పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు మరియు సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి,ఈ అంశాలపై ప్రభుత్వానికి సిఫారసు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ డిమాండ్లపై ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సానుకూలంగా స్పందించి, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి. నిత్యపూజయ్య, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి డి. పద్మనాభరావు, మైదుకూరు తాలూకా కార్యదర్శి మాచనూరు రాఘవయ్య, ఉపాధ్యక్షులు రాజన్న, మహిళా విభాగం సంయుక్త కార్యదర్శి బి. జె. పద్మావతి, పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఎండోమెంట్స్ నియామకంపై
## దేవాలయాల పరిరక్షణ సమితి అభ్యంతరం



**ప్రొద్దుటూరు, జులై 4, ప్రభాతవార్త**

కడప జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్‌గా శంకర్ బాలాజీని నియమించడం పట్ల దేవాలయాల పరిరక్షణ సమితి అభ్యంతరం వ్యక్తం చేసింది. శనివారం మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వైఎంఆర్ కాలనీలోని బిజెపి కార్యాలయంలో నివాళులర్పించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన నాయకులు, అల్లూరి త్యాగాలు దేశానికి స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం కడప జిల్లా ఎండోమెంట్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా శంకర్ బాలాజీ నియామకంపై సమితి నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో ఆయనపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని, అలాంటి నేపథ్యం ఉన్న అధికారిని బ్రహ్మంగారి మఠానికి తాత్కాలిక మేనేజర్‌గా నియమించడం భక్తుల మనోభావాలను దెబ్బతీసే నిర్ణయమని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత అధికారిని బాధ్యతల నుంచి తప్పించాలని లేదా సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ అంశంపై హిందూ సంఘాలు, బీజేపీ, జనసేన, శివశక్తి, విశ్వ హిందూ పరిషత్ తదితర సంస్థలు ఇప్పటికే అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ తిరిగి బాధ్యతలు అప్పగించడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు పుష్పాల శ్రీనాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వంకధార నరేంద్రరావు, జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ భూమిరెడ్డి భాస్కర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకురాలు సి.వి. జయలక్ష్మి, జనసేన నాయకులు బాబ్జి, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు వెంకట్ రాముడు, పద్మనాభయ్య, ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుంది

### మంత్రి కుమారుడు నిచ్చల్ నాగిరెడ్డి

**లక్కిరెడ్డిపల్లి: జులై 04 ప్రభాతవార్త**

ప్రతి టిడిపి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని మంత్రి కుమారుడు నిచ్చుల్ నాగిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలో చౌటపల్లి ,లక్కిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తిరుపతిలో నిర్వహించిన మహానాడుకు వెళుతున్న సమయంలో ప్రమాదానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న మండల టిడిపి ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్‌ను, వెంకటరమణను ఆయన పరామర్శించారు. అనంతరం కార్యకర్తలతో మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని ప్రతి కార్యకర్త సైనికుడిలాగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ఎవరూ ఇబ్బందులు పడుతూ ఉంటే చూడదని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదనమోహన్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ డాక్టర్ షఫీ నాయక్, మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కొండూరు వెంకటరామరాజు, గంగమ్మ ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు యాదవ్, ఆదిమూలం రామచంద్ర, ప్రతాప్ రెడ్డి, గన్ మెన్ రాజు, అశోక్ కుమార్, వెంకటరెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు పకీరయ్య, చెల్లు చంద్ర, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సర్ దరఖాస్తులు బిఎల్ఓకు ఇవ్వాలి

**రామాపురం జూలై 4 ప్రభాతవార్త:**



మండలంలోని ఓటర్లు సర్ దరఖాస్తు ఫారాలను మూడు రోజుల్లో ఆయా బూతు లెవెల్ ఆఫీసులకు ఇవ్వాలని తాసిల్దార్ వెంకటేశ్వర్లు ఎంపీడీవో జాషు వాలు అన్నారు. శనివారం వారు హసనాపురం చిట్లూరు గ్రామాల బూతులెవల్లో జరుగుతున్న ఓటర్ సవరణ వెరిఫికేషన్ ను తనిఖీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్లు మూడు రోజుల లోపల తమ ఎన్యూమిరేషన్ పారాలు స్థానిక బిఎల్ఓ లకు సమర్పించాలని లేనియెడల వారి ఓటు హక్కు కోల్పోతారని ఓటర్లు ఇది గమనించుకొని త్వరలో తమ ఓటు హక్కు కోల్పోకుండా ఎన్యూమీరేషన్ పారాలను సమర్పించాలని వారు కోరారు. వీరి వెంట ఆర్ ఐ సమద్ ఖాన్ బిఎల్వోలు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు ప్రారంభం

**పులివెందుల, జూలై 4 ప్రభాతవార్త :**

పులివెందుల పురపాలక సంఘ పరిధిలో ప్రత్యేక ఓటరు నమోదు (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జూలై 4 నుంచి 14వ తేదీ వరకు అన్ని స్వర్ణ వార్డు కార్యాలయాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు పురపాలక కమిషనర్ తెలిపారు.జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి, కడప, అలాగే పులివెందుల రెవెన్యూ డివిజనల్ అధికారి, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఆదేశాల మేరకు ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బీఎల్‌వోలు, ఆర్‌పీలు, అంగన్‌వాడీ టీచర్లకు అవసరమైన ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు శిబిరాలు కొనసాగుతాయని వెల్లడించారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతతో పాటు ఇప్పటివరకు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోని అర్హులైన ప్రతి ఒక్కరూ తమ సమీప వార్డు కార్యాలయంలో ఓటరుగా నమోదు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేయడంలో ప్రజలు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



## మన్యం వీరుడు అల్లూరిని నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలి

**రాజంపేట, జూలై 4 ప్రభాతవార్త**

తెల్ల దొరల బానిస సంకెళ్ల నుంచి ప్రజలకు విముక్తి కల్పించేందుకు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ప్రాణాలను లెక్కచేయకుండా పోరాటం చేసి చరిత్రలో నిలిచిపోయారని, అలాంటి మహనీయుని స్ఫూర్తిగా తీసుకొని నేటి తరం ముందు సాగాలని జనసేన పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎల్లటూరి శ్రీనివాసరాజు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక బంగ్లా వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం కోసం తెల్ల దొరల పాలనకు వ్యతిరేకంగా, బడుగు బలహీన వర్గాలకు బాసటగా పోరాటం చేసిన మహనీయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు సమ్మెట శివప్రసాద్, డ్రిప్ కుమార్, వర్మ ,శ్రీనివాసరాజు, మోలా, అబూబకర్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాస రాజు